క్లుప్తంగా

నేటి నుంచి ఎరువుల విక్రయం

అరకులోయటౌన్: స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం నుంచి ఎరువులు విక్రయించనున్నట్టు వ్యవసాయ శాఖ ఏవో ఫణిరాజ్ వర్మ ఓ ప్రకటనలో తెలిపారు. డీఏపీ 12 క్వింటాళ్లు, యూరియా 12 క్వింటాళ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్టు పేర్కొన్నారు. 45 కిలోల డీఏపీ బస్తాను రూ. 1350, 50 కిలోల యూరియా బస్తాను రూ. 270కు అందజేస్తున్నట్టు తెలిపారు. కొనుగోలు చేసేందుకు ఆసక్తి ఉన్న గిరిరైతులు వారి పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జెరాక్స్ కాపీలు తీసుకు రావాలని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు


పవనగిరి క్షేత్రంలో బాలాజీ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

అడ్డతీగల: స్థానిక పవనగిరి క్షేత్రంలో గల శ్రీ బాలాజీ స్వామి వారికి తొలి ఏకాదశి పురస్కరించుకుని బుధవారం విశేష పూజలు నిర్వహించారు.పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఆధార్ అప్‌టు డేట్ తప్పనిసరి


ఆధార్ కార్డుల వివరాలను నమోదు చేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ చిన్నతల్లి

జి.మాడుగుల: ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఆధార్ అప్‌టు డేట్ చేసుకోవడం తప్పనిసరని స్థానిక సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ కె.చిన్నతల్లి తెలిపారు. ఆధార్ కార్డుల అప్‌టు డేట్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. జి.మాడుగులలో ఇంటింటికీ వెళ్లి ఆధార్ కార్డుల వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధార్ కార్డు తీసుకుని 10 సంవత్సరాలు దాటిన వారు తప్పని సరిగా అప్‌టు డేట్ చేయించుకోవాలని తెలిపారు.

సభ్య రైతులకు విరివిగా రాయితీ రుణాలు


సీఈవో బెంటుకారి అభిన్న

అరకులోయ రూరల్: స్థానిక పీఏసీఎస్‌లో సభ్యులుగా ఉన్న రైతులకు విరివిగా రుణాలు అందజేస్తామని పీఏసీఎస్ సీఈవో బెంటుకారి అభిన్న బుధవారం తెలిపారు. సొసైటీలో సభ్యత్వం పొందిన ప్రతి పట్టాదారు రైతుకు రాయితీతో కూడిన వ్యవసాయ రుణాలు అందిస్తున్నామన్నారు. గతంలో రుణాలు పొందిన రైతులు బకాయిలు చెల్లించి కొత్త రుణాలు తీసుకోవాలని తెలిపారు. సభ్యత్వం లేని పట్టాదారు రైతులు కార్యాలయానికి నేరుగా వచ్చి ఆధార్,పాస్‌ఫొటోలు,పట్టా జెరాక్స్ కాపీలతో పాటు రూ.650 చెల్లించి సభ్యత్వం పొందాలని ఆయన సూచించారు.

వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెచ్ఎస్ సన్యాసిరావు

కె.కోటపాడు: విద్యార్థులు ఆహారాన్ని తీసుకునే ముందు చేతులను శుభ్ర పర్చుకోవాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు తెలిపారు. కొరువాడ వసతి గృహ విద్యార్థులకు ఆరోగ్య రక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం ఆయన అవగాహన కల్పించారు. చేతులు శుభ్రపర్చుకోకపోవడం వల్ల మలినాలు కడుపులోకి ప్రవేశించడం వల్ల రక్తహీనత సమస్య బారిన పడే అవకాశాలుంటాయని తెలిపారు. తద్వారా విద్యార్థులు త్వరగా అలసిపోవడం, ఎక్కువ సేపు ప్రయాణాలు చేయగలిగే శక్తిని కోల్పోనున్నట్లు వివరించారు. వసతిగృహం ప్రాంగణాలు పరిసరాల్లో మురుగు నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలనిసిబ్బందికి సూచించారు.


పట్టుదల ఉంటే పేదరికం అడ్డురాదని నిరూపించింది చింతూరు మండలం కల్లేరుకు చెందిన వసుంధర. వేలు మురుగన్, మంగళ దంపతుల కుమార్తె వసుంధర స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి పదో తరగతి పరీక్షల్లో 570 మార్కులు సాధించి డివిజన్ టాపర్‌గా నిలవడం ద్వారా ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. తండ్రి చిన్నపాటి తినుబండారాల వ్యాపారం చేస్తుండగా, తల్లి గృహిణి. భవిష్యత్తులో బాగా చదివి ఏరోస్పేస్ సైంటిస్టు అవ్వాలన్నదే తన లక్ష్యమని వసుంధర తెలిపింది.


చింతూరు మండలం నర్సింహాపురం గిరిజన బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పండా రాజులు, ముత్తమ్మల కుమార్తె ఆదిలక్ష్మీప్రియ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో 564 మార్కులు సాధించడం ద్వారా ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో మంచి మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యానని, భవిష్యత్తులో మంచిగా చదివి సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా స్థిరపడాలని ఉందని ఆమె తెలిపింది.


ఐఏఎస్ కావాలన్నదే తన లక్ష్యమని కూనవరం మండల పరిధిలోని మారుమూల శివారునున్న రేగులపాడు గ్రామానికి చెందిన బొగ్గా హర్షిత తెలిపింది. కోతులగుట్ట ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ బాలికల గురుకుల పాఠశాలలో టెన్త్ చదివిన హర్షిత, పదోతరగతి పరీక్షల్లో 559 మార్కులు సాధించడం ద్వారా ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. తండ్రి బొగ్గా సత్తిబాబు చింతూరు మండలం నర్సింహాపురం ఆశ్రమ బాలుర వసతి గృహంలో ఉపాధ్యాయుడిగా, తల్లి అచ్చమ్మ రేగులపాడులో అంగన్‌వాడీ వర్కరుగా పనిచేస్తున్నారు.


అడ్డతీగల మండలం వీరభద్రపురం గ్రామానికి చెందిన జక్కా వైష్ణవి అడ్డతీగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి, టెన్త్ పరీక్షల్లో 577 మార్కులు సాధించడంతో నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సీటు లభించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తండ్రి లేకపోయినా తల్లి,తాతయ్య అండతో తాను చదువుకున్నానని, వీరభద్రపురం నుంచి ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని అడ్డతీగలకు వచ్చి చదుకునే దానిని తెలిపింది.సాఫ్ట్‌వేర్ ఇంజినీరు కావాలన్నది తన లక్ష్యమని చెప్పింది.

పేదింటి పిల్లలు... ట్రిపుల్ ఐటీవీగా చదువులు

- ఫలిస్తున్న రాజన్న ఆశయాలు
- విద్యార్థులకు వరంలా మహానేత స్థాపించిన ట్రిపుల్ ఐటీలు
- సర్కారు బడుల నుంచి భావి ఇంజనీర్లు


చింతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

చింతూరు/కూనవరం/అడ్డతీగల : ఇంజినీరింగ్ వంటి ఉన్నత చదువులను ఉచితంగా అందించేందుకు మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి ఒక మంచి ఆశయంతో ఈ ట్రిపుల్ ఐటీలను ప్రవేశ పెట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మాత్రమే వీటిలో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ట్రిపుల్ ఐటీల్లో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ డిగ్రీని పూర్తి చేసిన వారు మంచి ప్యాకేజీలతో మల్టీనేషనల్ కంపెనీల్లో ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ కడప జిల్లా ఇడుపులపాయ, కృష్ణాజిల్లా నూజివీడు, ప్రకాశం జిల్లా ఒంగోలు, శ్రీకాకుళంలో ఈ ట్రిపుల్ ఐటీలున్నాయి. ఈ నాలుగు కేంద్రాల్లో మొత్తం 4,400 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి మంచి మార్కులు సాధించిన వారికి 92.99 శాతం, ప్రైవేటు పాఠశాలల్లో చదివి బీపీఎల్‌కు దిగువన ఉన్న వారికి 7.01 సీట్లు కేటాయిస్తున్నారు. ఈ ట్రిపుల్‌ఐటీలు ప్రారంభించినప్పటి నుంచి ఏటా గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు ప్రవేశాలు లభిస్తున్నాయి. చింతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన వేలు వసుంధర, పండా ఆదిలక్ష్మీ ప్రియ, నర్సింహాపురం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన పి.నవ్య, కూనవరం మండలం కోతులగుట్ట నుంచి బొగ్గా హర్షిత, అడ్డతీగల మండలం నుంచి జక్కా వైష్ణవి ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థుల వివరాలు

స్కూలు పేరు	విద్యార్థి పేరు	ట్రిపుల్ ఐటీ పేరు
చింతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల	పి. ఆదిలక్ష్మీప్రియ	ఒంగోలు
చింతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల	వేలు వసుంధర	ఒంగోలు
నర్సింహాపురం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల కూనవరం	పి.నవ్య	ఒంగోలు
ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ బాలికల గురుకులం కోతులగుట్ట	బొగ్గా హర్షిత	ఇడుపులపాయ
అడ్డతీగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల	జక్కా వైష్ణవి	నూజివీడు

'మతిభ్రమించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి'


మాట్లాడుతున్న గూడెంకొత్తవీధి ఎంపీపీబోయిన కుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు

గూడెంకొత్తవీధి: పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మతిభ్రమించి మాట్లాడుతున్నారని గూడెంకొత్తవీధి ఎంపీపీ బోయినకుమారి అన్నారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో వార్డెన్ల ద్వారా గంజాయి వినియోగం జరుగుతోందని గిడ్డి ఈశ్వరి ఆరోపించడం తగదన్నారు. పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుపై ఈశ్వరి ఆరోపణలు చేయడం తగదని, దీన్ని తామంతా ఖండిస్తున్నామని చెప్పారు.

గురుకుల కళాశాలను సందర్శించిన ఎమ్మెల్యే


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

రంపచోడవరం: స్థానిక గురుకుల బాలిక కళాశాల, పాఠశాలను స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం వారి సమస్యలు తెలుసుకున్నారు. తాగు నీటి సమస్య , పాఠశాల ప్రాంగణంలో కోతుల బెడద అధికంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్టు విద్యార్థులు తెలిపారు. పాఠశాలలో సమస్యలను లిఖిత పూర్వకంగా తనకు తెలియజేయాలని, పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు.

కష్టనష్టాల్లో అండగా ఉంటాం


ఎంపీటీసీ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీ తనూజారాణి, మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ


ఎంపీటీసీ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

హుకుంపేట: కష్టనష్టాల్లో గిరిజనుల ఎప్పుడూ అండగా ఉంటామని అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణి తెలిపారు. మండలంలోని దాలిగుమ్మడిలో మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణతో కలిసి ఆమె బుధవారం పర్యటించారు. హుకుంపేట ఎంపీటీసీ సభ్యురాలు రమ భర్త కొమ్ము సింహాచలం ఇటీవల మృతి చెందిన విషయన్ని తెలుసుకుని ఆ కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి తోడుగా ఉంటానని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ సింహాచలం మృతి బాధాకరమన్నారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, పార్టీ మండల అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు,స్థానిక సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ,వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు ఒంటుబు శామ్యూల్, జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు కొమ్ము పద్మనాభం,పెదబయలు మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కాతరి సురేష్‌కుమార్, నాయకులు పాంగి అనిల్,లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీకి ఎమ్మెల్యే పరామర్శ

హుకుంపేట: మండలంలోని దాలిగుమ్మడిలో ఎంపీటీసీ సభ్యురాలు కొమ్ము రమను ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం బుధవారం పరామర్శించారు. ఆమె భర్త సింహాచలం ఇటీవల మృతిచెందడంతో గ్రామంలో ఆమె ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం అందజేశారు. సింహాచలం మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. స్థానిక సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ,నాయకులు పాంగి అనిల్,శ్రీను,మధు పాల్గొన్నారు.

డి.గొందూరు సర్పంచ్‌కు ఎమ్మెల్యే పరామర్శ


రాంబాబును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

పాడేరు : వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, డి.గొందూరు సర్పంచ్ సీదరి రాంబాబును పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరాజు బుధవారం పరామర్శించారు. రాంబాబు పెదనాన్న సీదరి లక్ష్మయ్య అనారోగ్యంతో జిల్లా ఆస్పత్రిలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డి.గొందూరు గ్రామానికి వెళ్లి మృతదేహం వద్ద నివాళులర్పించి, రాంబాబుతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వనుగు బసవన్నదొర, ఎంపీటీసీ సభ్యుడు లకే రామకృష్ణ పాత్రుడు, సర్పంచ్‌లు వంతాల రాంబాబు, కుర్రబోయిన సింహాచలం, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర తదితరులున్నారు.

'సీహెచ్‌సీలో సక్రమంగా అందని వైద్య సేవలు'


సీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు

ముంచంగిపుట్టు: స్థానిక సీహెచ్‌సీలో వైద్య సేవలు సక్రమంగా అందక రోగులు అవస్థలు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు పాంగి పద్మారావు తెలిపారు. సీహెచ్‌సీని బుధవారం ఆయన సందర్శించి, రోగులతో మాట్లాడి, అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పలువురు రోగులు మాట్లాడుతూ కేవలం ఓపీ సమయంలో మాత్రమే వైద్యులు ఆస్పత్రిలో అందుబాటులో ఉంటున్నారని, కొన్ని రకాల మందులు, ఇంజక్షన్‌లు బయట నుంచి కొని తెచ్చుకుంటున్నామని తెలిపారు. వార్డుల్లో మంచాలపై బెడ్ సీట్లు ఉండడంలేదని చెప్పారు. అనంతరం పద్మారావు మాట్లాడుతూ వైద్య సేవలను సక్రమంగా అందజేయాలని కోరారు. రోగుల పట్ల వైద్య సిబ్బంది దురుసుగా మాట్లాడడం మంచి కాదన్నారు. వైఎస్సార్‌సీపీ మండల నేత పులిరాజు పాల్గొన్నారు.

రేపు నర్సీపట్నంలో జాబ్ మేళా

నర్సీపట్నం: పెదబొడ్డేపల్లి డాన్‌బాస్కో కళాశాలలో ఈ నెల 19న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఉపేంద్ర తెలిపారు. ఈమేళాకు హెట్రో, అపోలో, పేటీఎం, ముత్తూట్ తదితర కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. పదోతరగతి, డిప్లొమా, బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీ పాసైన నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.పూర్తివివరాలకు 6362508891,9059190485సంప్రదించాలని సూచించారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ


జీసీసీ పెట్రోల్ బంక్‌లో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

హుకుంపేట:అప్రమత్తతతోనే పెట్రోల్ బంకుల్లో అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని పాడేరు ఎస్ఎఫ్‌వో ఎ.వి.రమణ తెలిపారు. బంకుల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై స్థానిక జీసీసీ పెట్రోల్ బంకు సిబ్బందికి, ప్రజలకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాల్లో పెట్రోల్ నింపినప్పుడు అగ్నిప్రమాదం జరిగితే భయపడి పారిపోకుండా పక్కనే ఉన్న గ్యాస్ సిలిండర్‌తో మంటలను అదుపు చేయాలని సూచించారు. బంక్‌లో పెట్రోల్,డీజిల్ కోసం వచ్చే వాహన దారులు ఆయిల్ కొట్టించే సమయంలో ఫోన్‌లో మాట్లాడకూడదని, సిగరెట్ వంటివి బంకుల వద్ద కాల్చకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వెంకటేష్, త్రినాథ్, సత్యబాబు, పెట్రోల్ బంక్ సిబ్బంది సత్యనారాయణ,ప్రభాకర్ పాల్గొన్నారు.

బాలికలపై లైంగిక దాడులు సిగ్గు చేటు

దేవరాపల్లి: రాష్ట్రంలో పోక్సో కేసులు పెరిగిపోవడాన్ని, ఆడబిడ్డలపై లైంగిక దాడులకు పాల్పడటాన్ని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యుడు కాటపల్లి అప్పారావు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు బుధవారం దేవరాపల్లిలో ఆయన మాట్లాడుతూ పసిపిల్లలు, బాలికలపై లైంగిక దాడులు సభ్య సమాజానికి సిగ్గు చేటని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. చిన్నారులపై లైంగిక వేధింపుల దృష్ట్యా తల్లిదండ్రులు తమ బిడ్డల భద్రతపై ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో వారికి భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పోక్సో కేసులు అధికంగా నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి రక్షణ నిమిత్తం చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

చకచకా డ్రైనేజీ నిర్మాణ పనులు


రామాలయం వీధి నుంచి పాఠశాల వరకు నిర్మించిన డ్రైనేజీ


జీపుల స్టాండ్‌కు వెళ్లే మార్గంలో చేపట్టిన డ్రైనేజీ పనులు

జి.మాడుగుల: మండల కేంద్రం మాడుగులలో డ్రైనేజీల నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మూడు డ్రైనేజీలకు జిల్లా పరిషత్ జనరల్ నిధులు రూ.15లక్షలు మంజూరయ్యాయి. టెండర్ ఖరారు కావడంతో కాంట్రాక్టర్ పనులు చేపట్టారు. స్థానిక రామాలయం వీధి-పాఠశాల, మెయిన్ రోడ్డులో జీపుల స్టాండ్ వరకు రెండు డ్రైనేజీల నిర్మాణ పనులు చేపట్టారు. ఒక్కోదానికి రూ.6లక్షలు చొప్పున రూ.12లక్షలు మంజూరయ్యాయి. జీఎం కొత్తూరులో రూ.3 లక్షలతో డ్రైనేజీ నిర్మిస్తున్నారు. రామాలయం- పాఠశాల వరకు డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తి కాగా, మిగిలిన రెండు డ్రైనేజీల పనులు వేగంగా జరుగుతున్నాయి.

పాలసొసైటీలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల గెలుపు

ఎస్.రాయవరం : భీమవరం విశాఖ డెయిరీ పాల సొసైటీలో బుధవారం నిర్వహించిన డైరెక్టర్ల ఎన్నికల్లో నలుగురు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఎన్నికయ్యారు. నాలుగు డైరెక్టర్ల స్థానాలకు బుధవారం ఎన్నిక జరగగా అతికంశెట్టి సీతారాం, గుడాల సూరిబాబు, పోలినాటి సూరిబాబు, మడగల బండియ్య ఎన్నికయ్యారు. వారిని గ్రామ సర్పంచ్ గరగా నూకరాజు, డైరెక్టర్లు గరగా శ్రీను, ఉగ్గిన సన్యాసినాయుడు, లింగంపల్లి కృష్ణమూర్తి తదితరులు అభినందించారు.

91 మందికి వైద్య సేవలు


కర్నికలంకలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి శశికాంత్

జి.మాడుగుల: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎటువంటి ఆరోగ్యపరమైన సమస్యలు ఎదురైనా తక్షణమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ టి.శశికాంత్ తెలిపారు. మండలంలో సింగర్భ సచివాలయం పరిధిలో కర్నికలంకలో బుధవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. 91 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శశికాంత్ మాట్లాడుతూ కాచి చల్లార్చి వడపోసిన నీటిని తాగాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, దోమ తెరలను విధిగా వినియోగించాలని సూచించారు. 20 మందికి ఆర్‌డీటీ మలేరియా పరీక్షలు నిర్వహించామని, మలేరియా కేసులు నమోదు కాలేదు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎన్.ప్రకాష్, హెల్త్ అసిస్టెంట్ ఆర్.శోభన్‌బాబు,ఏఎన్ఎంలుబాలామణి,దేవుడమ్మపాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం గుడ్లు అక్రమంగా తరలింపు

- పట్టుకున్న స్థానికులు
- విచారణ జరిపిన సీడీపీవో


విచారణ నిర్వహిస్తున్న సీడీపీవో లక్ష్మీదేవి

సీలేరు: గూడెం కొత్తవీధి మండలం ధారకొండ పంచాయతీ కమ్మరితోట అంగన్‌వాడీ కేంద్రం నుంచి అక్రమంగా తరలిపోతున్న గుడ్లను స్థానికులు పట్టుకున్నారు. కమ్మరితోట అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకురాలు రెడ్డి జయంతి భర్త రాంబాబు ధారకొండలో ఓ కిరాణా వ్యాపారికి విక్రయించేందుకు తుప్పల్లో దాచిపెట్టిన కోడిగుడ్లను గుర్తించి పట్టుకున్నట్టు స్థానికులు తెలిపారు. ఈ మేరకు సీడీపీవో, ఐటీడీఏ పీవో, కలెక్టర్‌కు వాట్సప్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం ఉదయం జీకేవీధి సీడీపీవో లక్ష్మీదేవి కమ్మరితోట చేరుకుని విచారణ నిర్వహించారు. కమ్మరితోట అంగన్‌వాడీ పరిధిలో ఉన్న లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ నెలలో సక్రమంగా సరుకులు ఇచ్చినప్పటికీ గతంలో మాత్రం కోత విధించారని లబ్ధిదారులు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రాథమికంగా విచారణ నిర్వహించామని సీడీపీవో చెప్పారు. గురువారం ఎంపీడీవో పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామని ఆమె తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఎస్.రాయవరం : స్థానిక ఉన్నత పాఠశాలలో 1990-91లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం కలుసుకున్నారు. సుమారు 70 మంది నాటి విద్యార్థులు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్న నాటి ఆత్మీయ సంగతులు గుర్తు చేసుకున్నారు. నాడు తమకు బోధన జరిపిన గురువులను స్మరించుకున్నారు. సుమారు 33 ఏళ్ల తరువాత కలుసుకోవడంతో పూర్వ మిత్రులంతా ఆనందంతో పులకరించారు. ఆటపాటలతో సందడి చేసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ ఆత్మీయ సమావేశంలో ముప్పిన శ్రీను, కర్రి కోటి, దోనె రాజ్‌కుమార్, సోమిరెడ్డి మణి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం

చోడవరం: ప్రకృతి వ్యవసాయంతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చని నేచురల్ ఫార్మింగ్ అసిస్టెంట్ చిన్న తెలిపారు. బుధవారం రావికమతం మండలం దొండపూడి రైతు సేవా కేంద్రంలో రావికమతం, రోలుగుంట, మాకవరపాలెం, కోటవురట్ల, గొలుగొండ మండలాల్లో పని చేస్తున్న ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా రైతులకు కలిగే లాభాలు గురించి క్షేత్రస్థాయిలో అవగాసహ కల్పించాలని చిన్న చెప్పారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున బీజామృతం, ద్రవజీవామృతం తయారీపై తెలియజేయాలన్నారు. వ్యవసాయ సిబ్బంది రాంగోవింద, వర్మ, రైతు సంఘ ప్రతినిధులు నాగేశ్వరరావు, శివకుమార్, రామకృష్ణ, గర్రెడ్డి గణావతి, సన్యాసినాయుడు, మహాలక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.